ప్రజాశక్తి

బుధవారం 14 డిసెంబర్ 2022 5

పార్వతీపురం మన్యం



నేడు ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి-విజయనగరం

నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. దాకమర్రిలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో వివాహ వేదిక, కళాశాల ప్రాంగణానికి ఎదురుగా ఉన్న ఎన్‌సిసి మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నుంచి కాన్వాయ్ ద్వారా కళాశాల లోపల ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నారు. విఐపిల వేదిక వద్దకు చేరుకొనేందుకు రఘు ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ గేటు నుంచి ప్రవేశం కల్పించగా, ఇతరులకు మోపాడ రోడ్డు నుంచి ప్రవేశం కల్పించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలి

- ఫ్యాన్ స్విచ్ ఆపేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ
- ఘనంగా సిఐటియు పదో జిల్లా మహాసభలు

బహిరంగసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

పట్టణంలో భారీ ప్రదర్శన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

సిఐటియు ఎజెండాను ఎగురవేస్తున్న నర్సింహమూర్తి

ప్రజాశక్తి పార్వతీపురం/టౌన్

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ వారి శ్రమను దోచుకుంటున్నాయని, రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా 10వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ర్యాలీ అనంతరం ఎఎంసి మార్కెట్ యార్డ్ మైదానంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల రక్తాన్ని జెలగల్లా పీడిస్తున్నాయని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందాలంటే అందులో కీలక పాత్ర కార్మికులేనన్నారు. అలాంటి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా పాలన చేస్తున్నారు తప్ప కార్మికులను పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ చేతుల్లో పెట్టి వారిని అభివృద్ధి చేస్తున్నారు తప్ప కార్మికులను, ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలతో దేశ ఆర్థిక వ్యవస్థ నాశనమైందని మోడీ ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. నూతన విద్యా విధానంతో సామాన్య ప్రజలకు చదువు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యుత్ సంస్కరణలు, వ్యవసాయ నల్ల చట్టాలతో దేశాన్ని సర్వనాశనం చేసేందుకే బిజెపి ప్రభుత్వం పూనుకుంటుందని విమర్శించారు. రెండు లక్షల మంది ఉపాధి పొందుతున్న ఉత్తరాంధ్రాకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఈ ప్రాంత కార్మిక వర్గం ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్‌ను మూసివేస్తే కార్మిక వర్గం ఏకమై బిజెపిని పతనం చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలకు జై కొడుతూ వారు చేసే పనులకు వత్తాసు పలకడం సరైన పద్ధతి కాదన్నారు. మాట తప్ప మడం తిప్పమన్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ప్రజలను, కార్మికులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే విధానాలు అవలంభిస్తున్నారన్నారు. కార్మికులు కనీస వేతనాలు నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ఉన్న ఉద్యోగాలను తీసేవేసే పరిస్థితి ఉందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, వారి సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ స్విచ్ ఆపే పరిస్థితి కార్మిక వర్గంలో చేతిలో ఉందని హెచ్చరించారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుతో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపితే అక్రమ కేసులు, నిర్బంధాలు, ఇబ్బందులు పెట్టడం వైసిపి ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం ఎర్రజెండా చూస్తే భయపడాల్సిన పరిస్థితికి తెచ్చుకుందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ వారిని ఇబ్బంది పెట్టే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు.

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.ఉమమహేశ్వరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుతో అంగన్వాడీ, కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయలేని దయనీస్థితిలో ప్రభుత్వాలు పాలన చేయడం దుర్మార్గమమన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలియజేస్తే నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేసి కార్మికుల హక్కులను ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేసే పరిస్థితి దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కనిపిస్తుందని అన్నారు. కార్మికుల హక్కులను సమస్యలను పరిష్కరించుకోవాలంటే కార్మికులంతా ఏకమై ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, శ్రామికమహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగాడుతూ భవిష్యత్తులో జరగనున్న పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో సిఐటియు నాయకులు కె.అవినాష్, వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, టివి రాము, బివి రమణ, పట్టణ పౌరు సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్, వివిధ కార్మిక వర్గాల నాయకులు ప్రజాసంఘాల నాయకులు కార్మికులు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

బహిరంగసభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు
అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్రనాయకులు ఉమామహేశ్వరి

బహిరంగసభకు హాజరైన వివిధ రంగాల కార్మికులు, స్కీంవర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అరుణారుణం.. పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం వేదికగా సిఐటియు జిల్లా 10వ మహాసభలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఎఎంసి మైదానం వరకు వేలాది కార్మికులు ఎర్రజెండాలను చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రభుత్వాల తీరును ఎండగడుతూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ర్యాలీలో ప్రభుత్వాల తీరును నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ర్యాలీ, బహిరంగ సభ అనంతరం పట్టణ శివారులో ఉన్న విజయలక్ష్మి కల్యాణ మండపంలో మహాసభలు ప్రారంభమయ్యాయి. సిఐటియు సీనియర్ నాయకులు నరసింహమూర్తి జెండా ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి శ్రీరామ్మూర్తికి, మృతి చెందిన పలువురు కార్మికులకు నివాళులర్పించి, సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి మన్మధరావు మూడేళ్లలో సిఐటియు చేపట్టిన కార్యక్రమాలను, పోరాటాలను ప్రతినిధులకు తెలియజేస్తూ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

అభ్యుదయ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

కురుకుట్టి హెచ్‌ఎం సస్పెన్షన్

ఎట్టకేలకు అధికారుల చర్యలు
ఫలించిన గిరిజన సంఘాల పోరాటం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలో సంచలనం సృష్టించిన కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం జి.కృష్ణారావును సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 17న పాఠశాలలో విద్యార్థినిలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారనే విషయాన్ని 'ప్రజాశక్తి' వెలుగులోకి తీసుకొచ్చింది. అదే రోజు సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాఠశాలలో బాలికలను విచారించారు. జిల్లా అధికారులకు ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎం కృష్ణారావును రామభద్రపురం మండలం నేరళ్ళవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ చర్యపై గిరిజన సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ హెచ్‌ఎంపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరోసారి విచారణకు ఆదేశించారు. పార్వతీపురం ఆర్డీవో హేమలత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారుల బృందం నవంబర్ 5న పాఠశాలలో విచారణ చేపట్టింది. మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అధికారులు విచారణ నిర్వహించారు. వారు అందజేసిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎంపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇది జరిగి నెలరోజులు కావొస్తోంది. అనేక తర్జనభర్జనలు తర్వాత ఆయనను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై నేరళ్లవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పోలయ్యను వివరణ కోరగా కృష్ణారావును సస్పెండ్ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్ చెప్పినట్లు తెలిపారు.

ఫలించిన గిరిజన సంఘాల పోరాటం

కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన సంఘాలు చేసిన పోరాటం ఫలించింది. గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతిపత్రం సమర్పించారు. తర్వాత జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు వినతి పత్రాలు అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని, సర్వేయర్లు సకాలంలో నెలవారీ నివేదికలు సమర్పించాలని సంయుక్త కలెక్టరు ఒ. ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సర్వేశాఖ సాదారణవిధులు, రీసర్వే పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెసి మాట్లాడుతూ సర్వేయర్లు రోజువారీ విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో నివేదికలు సమర్పించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సర్వేశాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని, సిబ్బంది పనితీరుపై ప్రతి రెండు నెలలకు సమీక్షించాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బంది సెలవుపై వెళ్లకూడదని, సెలవు పెట్టినపుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నివేదికలు సమగ్రంగా తప్పులు లేకుండా సమర్పించాలని, ప్రతి నివేదిక సంతకంతో కూడి ఉండాలన్నారు. పెండింగు పనులను పదిరోజులలో పూర్తి చేయాలని తెలిపారు. బాగా పనిచేసే అధికారులకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్, డివిజనల్ డిప్యూటీ ఇనస్పెక్టర్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

కోర్టు కేసులపై సకాలంలో చర్యలు తీసుకోవాలి

కోర్టు కేసులపై తక్షణమే స్పందించాలని, సకాలంలో చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. ప్రభుత్వ శాఖల నోడల్ అధికారులతో కోర్టు కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెండింగులో గల కేసులన్నింటిపై 15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యల నివేదికను కేసుల వారీగా నివేదించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. కేసులపై ఎప్పటి కప్పుడు స్పందించాలని, సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొసీజరు ప్రకారం కేసులను ఫాలో అయితే ఆన్ లైన్ నందు కేసులు పూర్తి వివరాలు అందుబాటులోనికి వస్తాయని తెలిపారు. పెండింగు కోర్టు కేసులను అందుకు గాను కేటాయించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కేసులు విషయంలో సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని, సిబ్బందికి ఈ విషయంలో అవసరమైతే శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. సమీక్షా సమావేశంలో కలెక్టరు కార్యాలయ సి-సెక్షను సూపరింటెండెంటు డి.శేఖర్, ప్రభుత్వ శాఖల కోర్టు కేసుల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ పిఒ సుగుణకుమారి

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదమరికి పంచాయతీ పరిధిలోని శివందొరవలస అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసిడిఎస్ పిఒ సుగుణ కుమారి పరిశీలించారు. ఈ కేంద్రం నిర్వహణపై లోపాలు ఉన్నాయంటూ సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు రావడంతో స్పందించిన పిఒ రికార్డులను పరిశీలించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గ్రామస్తులు అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై సానుకూలంగా మాట్లాడడంతో ఫిర్యాదు దారు కక్షపూరితంగా వ్యవహరించారని తేలింది. నివేదికను పై అధికారులకు సమర్పిస్తానని పిఒ తెలిపారు.

ఆశాల సమస్యలపై సమరశీల పోరాటాలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి
- రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు
- ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నగరంలోని నిరంజనా నిరూలా నగర్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (ఎస్.కన్వెన్షన్) జరిగిన ఆ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆమె ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. మహాసభలో చేసిన తీర్మానాలను అనంతరం విలేకర్ల సమావేశంలో వివరించారు. రెండు రోజులు పాటు జరిగిన మహాసభల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు, వైద్య రంగంలో వస్తున్న మార్పులు, ఆశా లు ఎదుర్కుంటున్న సమస్యలు వాటి సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా మహాసభల్లో రానున్న మూడేళ్ల కాలంలో చేయాల్సిన కార్యాచరణపై చర్చించి పలు సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రానున్న మూడేళ్లలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

దేశంలో ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని, అందులో ఆశా వర్కర్లు భాగస్వామ్యం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసి ఆశావర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలో ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 5వేల ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేసి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని అన్నారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పన్నులు ధనవంతులపై వేయకుండా ఆహార ధాన్యాలపై వేయడం వల్ల నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందన్నారు. కార్మిక చట్టాలను ధనవంతులకు చుట్టాలుగా మార్చి కార్మిక కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు ఇవ్వకపోతే యజమానిని అరెస్ట్ చేయాలని, కానీ దోపిడీ దారులకు అనుకూలంగా ప్రభుత్వం ఉందన్నారు. సమ్మె చేసే హక్కును కాలరాస్తున్నా రన్నారు. పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుంటూ, కొత్తవి సాధించుకునే విధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పేదలకు ప్రభుత్వ రంగాల ద్వారానే సేవలు అందుతాయని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగావున్న ఏడు వేల పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఆశా కార్యక్తలపై పనిభారం పెరుగుతోందని అన్నారు. కోవిడ్‌లో మరణించినవారికి రూ.50లక్షలు చొప్పున పరిహారం చెల్లించకపోతే జగన్ ప్రభుత్వానికి కోర్టులకెక్కిస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్ల న్యాయమైన పోరాటానికి సిఐటియు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

మహాసభల్లో భాగంగా నిర్వహించిన 'ఆటపాట' కార్యక్రమంలోని విజేతలకు ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మహాసభ అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, బి.సుధారాణి, వై.మంగమ్మ, డి.అన్నపూర్ణమ్మ, సిహెచ్ పద్మలు వ్యవహరించారు. సమావేశంలో కోశాధికారి కె.కమల, తీర్మానాల కమిటీ కన్వీనర్ ఎం.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు అండగా ఉంటాం

ఆశా వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు అండగా ఉంటామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు అన్నారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలు బలోపేతం కావడం ద్వారానే పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. మహాసభకు హాజరైన క్వీన్స్ ఎన్ఆర్ఐ జనరల్ మేనేజర్ సతీష్‌బాబు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. వీరు చేస్తున్న పోరాటాలు స్ఫూర్తి దాయకమన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. నేడు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హక్కులు సాధించాలంటే చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకలు అవసరమన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించు కోవడం ద్వారా మన సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు.

నీరు వృథా చేయొద్దు : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

తాగునీటిని వృథా చేయొద్దని, ఇళ్లలోని చెత్తాచెదారాలను కాలువల్లో వేయొద్దని మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు కోరారు. ఎఐఐబి, యునిసెఫ్ -సర్డ్స్ సౌజన్యంతో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లకు, యుఎల్‌బి, మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. అనేక రకాల రోగాలకు కలుషిత నీరే కారణమని పరిశోధనలు చెబుతున్నాయని తెలిపారు. నీటిని ఎంత పొదుపుగా వాడితే భావితరాలకు అంతమేలు చేసినట్లవుతుందన్నారు. పారిశుధ్య నిర్వహణలో మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడం వెనుక అన్నివర్గాల ప్రజల కృషి ఉందని చెప్పారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పంపిణీ చేసిన డస్ట్‌బిన్ ల్లో చెత్త వేయాలని సూచించారు. అర్బన్ ఐసిడిఎస్ సిడిపిఒ బి.సత్యవతి మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణకు పనిచేయాలన్నారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ మానవాళికి వస్తున్న జబ్బుల్లో 80శాతం కలుషిత నీరే కారణమని చెప్పారు. కౌన్సిలర్ పి.సన్యాసమ్మ మాట్లాడుతూ నీటి పొదుపు భవితకు మదుపు లాంటిదని చెప్పారు. అనంతరం ప్రాజెక్టు స్టేట్ కో-ఆర్డినేటర్ చంద్రకళ వాష్ సేవలపై శిక్షణను తెరపై చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మోహన్‌రావు, మహేష్, రవికుమార్, ఫెసిలిటేటర్ బి.కనకరత్నం పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిషనర్ శంకరరావు, ఐసిడిఎస్ సిబ్బంది

విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

పార్వతీపురంటౌన్ : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. పట్టణంలోని బెలగాంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు హెమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేయించి అనారోగ్య సూచనలున్న విద్యార్థులను, సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేసి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్య వివరాల రికార్డులను పరిశీలించి హెమోగ్లోబిన్ శాతం తక్కువ, అనారోగ్య లక్షణాలున్న విద్యార్థులకు నయమయ్యే వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేసి నమోదు చేయాలని వసతి గృహ సిబ్బందికి సూచనలు చేశారు. టెట్నస్, ధనుర్వాతం నివారణకు విద్యార్థులకు ఇచ్చే టిడి వ్యాక్సిన్ ప్రక్రియను పరిశీలించారు. గిరిజన వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య సర్వే కొరకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌లో విద్యార్థుల ఆరోగ్య వివరాల నమోదును త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పెదమోహనరాయుడు, ఎం.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పుష్ప, జయగౌడ్, వైద్య హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీరఘట్టాంలో గడపగడపకూ

వీరఘట్టం : మండల కేంద్రంలోని నాలుగో సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ. వి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నారన్నారు. కావున మండల స్థాయి అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డుకు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

సీతానగరం: మండలంలోని రేపటివలసలో రూ.1.60 కోట్ల నిధులతో 1.85 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల ఈ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు రహదారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి రోడ్డు నిర్మాణాలకు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. దీంతో ఈ గ్రామస్తుల చిరకాల కోరిక తీరనుంది. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, పిఆర్ ప్రాజెక్ట్స్ డిఇ సన్యాసిరావు, ఎఇ సంతోషి కుమారి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే పై అవగాహన అవసరం

గుమ్మలక్ష్మీపురం : భూములను రీసర్వే చేసేటప్పుడు డ్రోన్ సర్వేపై డిజిటల్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు, విఆర్వోలకు అవగాహన అవసరమని స్థానిక తహశీల్దార్ జె.రాములమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గత మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో చివరి రోజు తహశీల్దార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణ తీసుకున్న అనంతరం విఆర్ఒలు, డిజిటల్, వ్యవసాయ సహాయకులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి డ్రోన్ సర్వే విజయవంతమయ్యేలా కృషి చేయాల అన్నారు. ముందుగా అనుకున్న మేరకు సర్వే నిర్వహించి అధికారులకు అందించాలని కోరారు. గ్రామాల్లో గ్రౌండింగ్ ట్రూత్, డిఎల్ఆర్, ఆర్ ఒఆర్ అనే వాటిపై పూర్తిగా శిక్షణ తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఎక్కడా పొరపాట్లు జరగకుండా క్షుణ్ణంగా డ్రోన్ సర్వేను నిర్వహించి అధికారులకు అందించాలని అన్నారు. శిక్షణ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజేంద్ర తదితరులు ఉన్నారు.

వాలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపిడిఒ రమేష్

పథకాలపై అవగాహన అవసరం

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన అవసరమని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలో నిర్వహించారు. మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు ఆరు ఖాళీలకు ఇంటర్వ్యూలు చేసి, ఆ ఆరుగుర్ని ఎంపిక చేశామని తెలిపారు.

షాపుల అద్దెకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట : స్థానిక మెయిన్ రోడ్డులోని కమ్యూనిటీ భవనం ఎదురుగా ఐటిడిఎ కొత్తగా నిర్మించిన షాపులు అద్దెకు ఇవ్వనున్నట్టు ఐటిడిఎ పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గుడ్ విల్‌కు రూ.3 లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9392917692 నెంబర్ను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు ప్రత్యేక పాయింట్లు కేటాయించాలి

పార్వతీపురం టౌన్ : ఉపాధ్యాయ బదిలీల్లో రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా ప్రధాన బాధ్యులకు ప్రత్యేక పాయింట్లు కేటాయించాలని ఎపి రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల వేదిక (ఫోర్టో) ఛైర్మన్ కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి సామల సింహాచలం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాస్తవానికి విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో మద్దతునిస్తూ విజయవంతం చేస్తున్నది రిజిస్టర్డ్ సంఘాలేనని వారు పేర్కొన్నారు. కొంతకాలంగా రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాల పట్ల ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని, విద్యారంగ, సమస్యలపై నిర్వహిస్తున్న సమావేశాలకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను ప్రభుత్వం గుర్తించాలని, టీచర్ల బదిలీల్లో ఐదు ప్రత్యేక పాయింట్లు కేటాయించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జిపిడిపిపై రెండో రోజు శిక్షణ



సమావేశంలో పాల్గొన్న ఎంపిడిఒ, అధికారులు

సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిపిడిపిపై గ్రామ సర్పంచులకు సచివాలయ సిబ్బందికి రెండో రోజు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రణాళికలు అవసరమన్నారు. వాటితోనే గ్రామాల అభివృద్ధి అవుతాయన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.పవన్‌కుమార్, శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలు భవిష్యత్తుకు ఉపయోగకరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజ్ఞాన ప్రదర్శనలపై విద్యార్థులు మక్కువ చూపితే భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో సైన్స్ విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ప్రతి పిల్లలు వారు రూపొందించిన డెమో క్లాసులో చాలా చక్కగా ఇచ్చారని అన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్ లో పాల్గొన్న సుమారు 60 ప్రదర్శనలో ఐదు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, పాఠశాల హెచ్ఎం వీమయ్య, గ్రామ సర్పంచ్ బి.గౌరీశంకర్రావు, దోన్ మేరా దోన్ సభ్యులు, వైఎస్ వర్గ కార్య సంఘ పెద్దలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన ప్రదర్శనలు

పార్వతీపురం రూరల్ : మండలంలోని ఎంఆర్ నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పట్టణ, మండలానికి చెందిన పలు పాఠశాలల ప్రదర్శనలు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ఇన్చార్జి హెచ్ఎం వై రామకృష్ణ తెలిపారు. ఈ ప్రదర్శన ఎంపికలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ప్రసన్న రాణి, ప్రసాద్ బందలుప్ప జడ్పీ పాఠశాల నుంచి రెండు, పట్టణానికి చెందిన టిఆర్ఎంఎం ఉన్నత పాఠశాల నుంచి రెండు , ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఒక ప్రదర్శన ఎంపికైనట్లు ప్రకటించారు.

సీతంపేటలో సైన్స్ ఫెయిర్

సీతంపేట : స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో 55 ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటిడబ్ల్యుఒ జి.మంగ వేణి మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తద్వారా మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఇలాంటి సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థులు సైన్స్ పట్ల మంచి పట్టు సాధిస్తారని అన్నారు. ఎంఇఒ ఎం.ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్లో కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రాజెక్టులు ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థుల మెదడుకు పదును పెట్టినట్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని : ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని, ప్రతీ అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించి, నూతన ఆవిష్కరణ దిశగా పాఠశాలలో విద్యాబోధన కొనసాగాలని ఎంఇఒ శ్రీనివాసరావు, బిఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్ విజయ నిర్మల అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ గురుకులంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో భామిని, బత్తిలి, బాలేరు, పెద్దదిమిలి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫుడ్ ఫ్రెండ్లీ, హెల్త్ అండ్ క్లీన్, సాఫ్ట్‌వేర్, పర్యావరణం, గణిత, సైన్స్ మోడల్స్ ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఐదు విభాగాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఇఒ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిజె కాలేజీ అధ్యాపకులు నారాయణరావు నాయుడు, నాగభూషణరావు, సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఇందూ, శేషగిరి రావు, జయలక్ష్మి, సి ఆర్ పి లు సురేష్, ప్రసాద్ పున్నారు.

భామిని : సైన్స్ నమూనాల ప్రదర్శన పరిశీలిస్తున్న ఎంఇఒ, ప్రిన్సిపల్

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి, గిరిజన ఆశ్రమఉన్నత పాఠశాలల పాల్గొన్నట్లు నోడల్ అధికారి దూషి నాగమణి తెలిపారు. బిటవాడ పాఠశాలకు చెందిన పి లావణ్య పర్యావరణం అనుకూల వస్తువులపై, కంబర వలసకు చెందిన ఎ.లావణ్య ఆరోగ్యం, పరిశుభ్రత, తలవరం పాఠశాలకు చెందిన డి.నితిన్ కుమార్ సాఫ్ట్ వేర్, యాప్స్, వీరఘట్టం బాలికలఉన్నత పాఠశాల చెందిన ఎస్.రోజా పర్యావరణం, మార్పులు, వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన టి.యమున గణిత నమూనాలకు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైనట్లు నాగమణి తెలిపారు. కార్యక్రమంలో గైడ్స్ టీచర్లు ఎ.కేశవరావు, వెంకట్రావు, జి.రామారావు, రజిని, శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమోదదాయకంగా ట్రేడ్ లైసెన్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ట్రేడ్ లైసెన్సులు, రేట్లు అన్ని వర్తక, వాణిజ్య, చిల్లర వ్యాపారులందరికీ ఆమోదదాయకంగా ఉండేలా కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకున్నారని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ బి.గౌరీశ్వరి సమక్షంలో కమిషనర్ అధ్యక్షతన పురపాలక సంఘం ట్రేడర్లు, వర్తక వాణిజ్య వ్యాపారులతో కలిసి జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా వచ్చే ఏడాది 2023 ఏప్రిల్ మాసం నుంచి అమలు చేయబోయే ట్రేడ్ లైసెన్సులు రేట్లుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ముందుగా వ్యాపార సంఘాలు, వర్తకుల నుంచి సలహాలు, సూచనలను సమావేశంలో తీసుకుని అందరికీ అందుబాటు లో ఉండే రేట్లను నిర్ణయించిందని తెలిపారు. ఇదే అంశంపై 2022 -23లో పెంచిన ట్రేడ్ లైసెన్సు రేట్లు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని కొన్ని వర్గాల వ్యాపారస్తులు, వర్తకసంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కమిషనర్‌కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అందరి అభ్యర్థనలను పరిశీలించిన తర్వాత బొబ్బిలి, తణుకు మున్సిపాల్టీల ట్రేడ్ లైసెన్సులను పరిశీలించి కొన్ని రకాల వ్యాపారాల ట్రేడ్ రేట్లు సవరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వచ్చే 2023 - 24 సంత్సరానికి సవరించిన ట్రేడ్ లైసెన్సు రేట్లను కౌన్సిల్ సభ్యుల సమక్షంలో షెడ్యూల్ రేట్లకు ఆమోదం తెలుపుతూ తుది జాబితా త్వరలోనే అన్ని వ్యాపార వర్గాలకు అందజేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కె.రుక్మిణీ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కమిషనర్ రామఅప్పల నాయుడు, అధికారులు, వివిధ వర్తక వాణిజ్య సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జంఝావతి ప్రాజెక్ట్ అడ్డంకులపై చర్చ

ప్రజాశక్తి - పార్వతీపురం

చిరకాల పార్వతీపురం మన్యం జిల్లా రైతుల ఆకాంక్ష అయిన జంఝావతి ప్రాజెక్టు పూర్తి కావడానికి ఉన్న అడ్డంకులపై ఎపి టిడ్కో ఛైర్మెన్ జమ్మాన ప్రసన్న కుమార్ తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో మంగళవారం చర్చించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పనులు దంగభద్ర వద్ద రూ.5 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని వివరిస్తూ మిగిలిన పనులు ఆర్‌కెఎన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇంకా చేయాల్సి ఉందని అన్నారు వాటర్ డిస్ట్రిబ్యూషన్ కోసం చేపట్టిన 14.94 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం 23 శాతం పనులు జరిగాయని తెలిపారు. పనుల పురోగతిని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఇంజనీర్ ఇన్ చీఫ్ సతీష్ కుమార్‌కి ఫోన్ ద్వారా మాట్లాడారు. ఆ తర్వాత ఈ పనుల పూర్తికి తగిన చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే ప్రాజెక్ట్ పూర్తయితే వందలాది మంది రైతులకు, కొన్ని వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చి ఈ ప్రాంత రైతుల జీవనాధారమైన వ్యవసాయం చేసుకొని వారు సంతోషంగా జీవించడానికి అవకాశం ఉంటుంది అని తెలిపారు. అనంతరం జంఝావతి అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి మిగిలిన పనులతో పూర్తిస్థాయి నివేదిక అందజేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, కృష్ణపల్లి సర్పంచ్ బోను రామి నాయుడు, పెదబొండపల్లి ఎం పి టీ సీ మండలి పకీరునాయుడు, చుక్క లక్ష్మి నాయుడు,నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు , రైతు నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్ఐఒ సత్యనారాయణ

సక్రమంగా విద్యా బోధనలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులకు సక్రమంగా విద్యా బోధనలు అందించాలని ఆర్ఐఒ మజ్జి సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూనియర్ కళాశాలలో జరుగుతున్న అర్ధ సంవత్సర పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు నేడు పనులు పర్యవేక్షిస్తూ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా విద్యా బోధనలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలలో అన్ని వసతులు కల్పించే దిశగా నాడు నేడు నిధులు కేటాయించి కళాశాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించడం చాలా సంతోషమన్నారు. నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపట్టి కాలేజీని అభివృద్ధి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆర్ఐను కళాశాల ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వైసిపిని గద్దె దించాలి : శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో వైసిపిని గద్దె దించాలని మాజీఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు ప్రజలను కోరారు. గరుగుబిల్లి మండలం నాగూరులో ఏర్పాటు చేసిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడున్నర ఏళ్లలో వైసిపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి కల్పన లేక ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. ప్రజల కష్టాలు తీరాలంటే మళ్లీ టిడిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రైతు సంక్షేమమని చెప్పుకుంటున్న వైసిపి రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వరి కోతలు ప్రారంభించి రెండు నెలలైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కళ్లల్లోనే మగ్గిపోతున్నాయని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం వారిని పూర్తిగా అణగదొక్కారని అన్నారు. జాబ్ క్యాలెండర్ తీసుకొస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం నేటి వరకు ఒక ఉద్యోగ అవకాశం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి టిడిపి మండల కన్వీనర్ అక్కేనా మధుసూదన్ రావు, మాజీ జెడ్పిటిసి జగదీశ్వరి, టిడిపి నాయకులు పురుషోత్తం నాయుడు, నందివాడ కృష్ణబాబు, నరేష్, జానకి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : గిరిజనులపై వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, గిరిజనుల సంక్షేమ కావాలంటే చంద్రబాబు సిఎం కావాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పనుకువలస పంచాయతీ పెదచీపురువలస, చిన చీపురువలస, కోస్టువలస, గుంటమామిడివలస, కందిరివలస తదితర గిరిజన గ్రామాల్లో మంగళవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు హయాంలో గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజుదేవ్. పిన్నింటి ప్రసాద్ బాబు, యుగంధర్,. ముఖీ సూర్యనారాయణ, కె.పోలినాయుడు, సిహెచ్ కనక తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయరామరాజు

క్రీడలు నైపుణ్యాన్ని వెలికితీతకు దోహదం

ప్రజాశక్తి - పాలకొండ

క్రీడా పోటీలు విద్యార్థుల యొక్క క్రీడా నైపుణ్యాలను వెలికి తీస్తాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డక్టార్ జి.జనార్దన్‌నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీలో వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాయి మహిళా కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ యూనివర్సిటీ పీడీలు డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై ఇతర కళాశాలలకు చెందిన వ్యాయామ అధ్యాపకుల సహకారంతో కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన క్రీడాకారుణిలు అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున తమిళనాడులోని అమిత్ యూనివర్సిటీలో ఈనెల 21నుంచి 24వరకు జరగనున్న అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో క్రీడాకారుణిలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు పీడీల అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకష్ణ, కళాశాల ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ బి. రాజు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సీతారాం, కళాశాలకు చెందిన ఇతర అధ్యాపకుల పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో పాటు ఇతర కళాశాలకు చెందిన అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జనార్ధన్ నాయుడు

పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పేదలకు అండగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని డోలమడ సచివాలయం పరిధిలో పొట్లి, జి.వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలపైన, వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ పరిధిలో గల వెంకటాపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించే దిశగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరికి మహేష్, ఉపసర్పంచ్ తిరుపతిరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎంపిటిసి సభ్యులు సేనాపతి నిర్మల, వైసిపి నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఆర్‌బికెల్లో అందుబాటులో ఎరువులు

పాచిపెంట : ప్రస్తుత రబీ సీజన్లో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతి రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలం ఎక్కువగా మొక్కజొన్న పంట సాగువుతుందని, పంట కాలం మొత్తానికి సుమారు 450 టన్నుల యూరియా, 150 టన్నుల డిఎపి, 70 టన్నుల పొటాస్ ఉండాల్సి ఉండగా ఈ సీజన్లో ఇప్పటి వరకూ 130 టన్నుల యూరియా, 60 టన్నుల డిఎపి, 25 టన్నుల పొటాష్ ఎరువు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని కర్రివలస, పాచిపెంట, మాతుమూరు, కేసలి, కొటిక పెంట, గురువు నాయుడుపేట, రాయిగుడ్డి వలస, పాంచాలి రైతు భరోసా కేంద్రాల్లో ఈ ఎరువులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. అలాగే గిరిజన రైతులకు 90 శాతం సాధారణ రైతులకు 40శాతం రాయితీపై వరి పంట కోసేముందు చల్లుకోవడానికి అనువైన అపరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. 26 క్వింటాళ్ల మినుములు పియు 31 రకం అందుబాటులో ఉందని, ఈ రకం ఎలాంటి తెగులు రాకుండా అధిక దిగుబడి నిచ్చే రకమని, అలాగే 10 క్వింటాళ్ల ఐపిఎం 2-14 పెసలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ విత్తనాలు పాచిపెంట, కొటికపెంట రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు.

నేరాలు ఘోరాలు

మృతి చెందిన సుప్రియ

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - కురుపాం

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే గుమ్మ లక్ష్మీపురం మండలం కొత్తవలసకు చెందిన కొండగొర్రె సుప్రియ (24) తల్లిదండ్రులు ఉద్యోగానికి దరఖాస్తు చేయమని మందలించారు. దీంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కొమరాడ : అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. నాటు సారా రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో గుమ్మడ సమీపంలో సారా రవాణా చేస్తున్న వ్యక్తి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తి నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు 160 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.


మద్యం బాటిళ్లతో పట్టుబడ్డ నిందితుడు

మద్యం సీసాలు పట్టివేత

సీతానగరం : మండలంలోని బూర్జ వైన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటళ్లతో వ్యక్తిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వివరాలకు వెళ్తే బలిజిపేట మండలం మొరగడంకు చెందిన ఎస్.కృష్ణమూర్తి 115 మద్యం బాటిళ్లు టివిఎస్ మోపెడ్‌పై అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచార మేరకు పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి బొబ్బిలి కోర్టు తరలించినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు.

మహిళపై లైంగిక దాడి

వీరఘట్టం : స్థానిక పాత పోస్టాఫీసు వద్ద మతిస్థిమితం లేని మహిళలపై గుర్తుతెలియని వ్యక్తులు లైంగిక దాడి చేసినట్లు వచ్చిన పుకారులపై ఎస్ఐ ఎం.హరికృష్ణ స్పందించారు. మంగళవారం ఆయన ఘటనా స్థలానికి చేరుకుని లైంగిక దాడి గురైన మహిళను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ ప్రథమ చికిత్స నిర్వహించారు. మహిళ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.